వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 313 శనివారం | 29 జూన్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

## ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు




8లో..

- వైద్య రంగం విస్తరించడమే కాంగ్రెస్ లక్ష్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఘనంగా మెడికవర్ హాస్పిటల్ ప్రారంభం



4 లో..

## నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

మెడికల్ కళాశాల, సమీకృత కలెక్టరేట్‌ల పరిశీలన



8 లో..

## రూ.30 కోట్లతో భద్రకాళి అభివృద్ధి

ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు

మాస్టర్ ప్లాన్ ప్రకారం పనులు

దేవాదాయ, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు

# అభివృద్ధిలో హైదరాబాద్‌తో.. పోటీపడాలి



వివరాలు 2లో..

వరంగల్‌ను హైదరాబాద్‌తో సమానంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరాభివృద్ధిలో భాగంగా శనివారం హనుమకొండ కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రేవంత్ రెడ్డి వివిధ అభివృద్ధి పనులపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి హోదాలో తొలి సారిగా విచ్చేసిన సీఎం వరంగల్ నగరాన్ని హెరిటేజ్ సిటీగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి టెక్స్టైల్ పార్కుకు కనెక్టివిటీ ఉండేలా రోడ్డుమార్గం నిర్మించాలని, స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. టెక్స్టైల్ పార్కుకు సంబంధించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్, ఫోటో ఎగ్జిబిషన్‌ను సీఎం పరిశీలించి వివిధ అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. అదే విధంగా ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ వ్యయాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా రూ.1100 కోట్లనుంచి రూ.1726 కోట్లకు పెంచడంపై మండిపడ్డారు. నిర్మాణ వ్యయంపై పూర్తిస్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. -వరంగల్ వాయిస్, వరంగల్

- హెరిటేజ్ సిటీగా ఓరుగల్లు
- ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డు భూసేకరణ చేయాలి
- అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి ప్రణాళికలు సిద్ధం చేయండి
- డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం
- నాలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు
- మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ సంస్థపై ఆగ్రహం
- వరంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి రివ్యూ



## వీడని నీటి కష్టాలు

గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ను తాగునీటి కష్టాలు కలవర పెడుతున్నాయి. పేరు మోసిన ఇంజినీర్లు ఉన్నప్పటికీ పైప్ లైన్ లీకేజీలు నగరాన్ని వీడనంటున్నాయి. పోచమ్మ మైదాన్ సమీపంలో పైప్ లైన్ లీకేజీ కారణంగా గత ఐదు రోజులుగా తాగునీరు లేక ఇబ్బందులు పడిన ఘటన మరువక ముందే దేశాయిపేట ఫిల్టర్ బెడ్ మీదుగా ఆటోనగర్ వెళ్లే దారిలో శనివారం పైప్ లైన్ లీకేజీ బల్దియా అధికారులకు సవాల్ విసురుతోంది. పైప్ లైన్ నుంచి తాగునీరు ఎగిసిపడుతూ ఫౌంటెన్ ను తలపించింది. అధిక మొత్తంలో తాగునీరు డ్రైనేజీ పాలైంది.
-వరంగల్ వాయిస్, కాశిబుగ్గ

# అభివృద్ధిలో హైదరాబాద్‌తో..
# పోటీ పడాలి



- హెరిటేజ్ సిటీగా ఓరుగల్లు
- ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డు భూసేకరణ చేయాలి
- అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి ప్రణాళికలు సిద్ధం చేయండి
- డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం
- నాలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు
- మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ సంస్థపై ఆగ్రహం
- వరంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి రివ్యూ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ నగరాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం హనుమకొండ కలెక్టరేట్ లో నిర్వహించిన రివ్యూలో వివిధ అంశాలపై అధికారులకు దిశా నిర్ధేశం చేశారు. ఈ ప్రస్థానం ఇక్కడితో ఆగకుండా వరంగల్ నగర అభివృద్ధిపై ఇకనుంచి ప్రతీ 20రోజులకోసారి ఇంచార్జి మంత్రి సమీక్ష నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా హనుమకొండ కలెక్టరేట్ లో ఏర్పాటు మహిళా శక్తి క్యాంటిన్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా వివిధ మహిళా సంఘాలకు రూ.518 కోట్ల విలువ చేసే చెక్కులను అందజేశారు. అదే విధంగా మరో 45 రోజుల్లో వరంగల్ అభివృద్ధిపై తనే స్వయంగా సమీక్ష చేయనున్నట్లు ప్రకటించారు.

## డీపీఆర్‌లు సిద్ధం చేయండి..

స్మార్ట్ సిటీలో భాగంగా వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకోసం డీపీఆర్ లు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అందుకుగాను రూ. 5కోట్లను మంజూరు చేశారు. 2050 సంవత్సరం లక్ష్యంగా అభివృద్ధి జరగాలని సూచించారు. వరంగల్ లో డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు డ్రింకింగ్ వాటర్ లైన్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. నాలాలు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. గ్రేటర్ ఆస్తుల రక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. మామునూరు ఏయిర్ పోర్ట్ విషయంలో కూడా అధికారులతో చర్చించారు. సాయంత్రం ప్రైవేట్ యాజమాన్యంలో ఏర్పాటు చేసిన మెడికవర్ ఆస్పత్రిని ప్రారంభించారు.

## ఇన్నర్, అవుటర్ రింగు రోడ్డు..

ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. భూములు కోల్పోయిన వారికి ప్రభుత్వం తరుపున చేయూత నందించాలని అధికారులకు సూచించారు. భూసేకరణకు అవసరమయ్యే నిధులకు సంబంధించి పూర్తి వివరాలు అందిస్తే నిధులు విడుదల చేస్తానన్నారు. నేషనల్ హైవే నుంచి నేషనల్ హైవేకు కనెక్ట్ అయ్యేలా ఔటర్ రింగ్ రోడ్డు ఉండాలని సూచించాచు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి టెక్స్టైల్ పార్కుకు కనెక్టివిటీ ఉండేలా రోడ్డుమార్గం ఏర్పాటు చేయాలన్నారు. నగర అభివృద్ధికి సంబంధించి సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

## వన మహోత్సవం..

టెక్స్టైల్ పార్కువద్ద వన మహోత్సవం లోగోను మంత్రులు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అక్కడే మొక్కను నాటి నీళ్ళు పోశారు. ఈ సందర్భంగా టెక్స్టైల్ పార్కుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎన్ని కంపెనీలు వచ్చాయి, ఎంత మందికి ఉపాధి లభిస్తుందనే వివరాలతో పాటు టెక్స్టైల్ పార్కు కు సంబంధించిన సమగ్ర వివరాలను అధికారులు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. టెక్స్టైల్ పార్కు కు సంబంధించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్, ఫోటో ఎగ్జిబిషన్ ను సీఎం పరిశీలించారు. కైటెక్స్, యంగ్ వన్ సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. టెక్స్టైల్ పార్కు ప్రాంతాన్ని ప్రత్యేక జోన్ గా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. టెక్స్టైల్ పార్కు కోసం భూములు ఇచ్చిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందించేలా కృషి చేస్తామని వెల్లడించారు.

## ముఖ్యమంత్రికి ఘన స్వాగతం..

హైదరాబాద్ నుంచి వరంగల్ గీసుకొండ మండల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ హెలికాప్టర్ ద్వారా శనివారం మధ్యాహ్నం 1.15 గంటలకు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద సీఎం రేవంత్ రెడ్డికి రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, చీఫ్ సెక్రెటరీ శాంతి కుమారి, డీజీపీ రవి గుప్తా, ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కె.నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, రేవురి ప్రకాష్ రెడ్డి, మురళి నాయక్, యశశ్విని రెడ్డి మామిడాల, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు, వరంగల్ కలెక్టర్ సత్య శారదా దేవి తదితరులు పుష్పగుచ్చాలను అందించి ఘనంగా స్వాగతం పలికారు.











## ఆస్పత్రి నిర్మాణ సంస్థపై ఆగ్రహం..

టెక్స్టైల్ పార్కు పరిశీలన అనంతరం రోడ్డు మార్గంలో వరంగల్ లో నిర్మిస్తున్న ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ముఖ్యమంత్రి సందర్శించి అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణం విషయంలో ఇష్టారీతిన అంచనా వ్యయం పెంచడంపై అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి అప్రూవ్ లేకుండా రూ.1100 కోట్లున్న అంచనా వ్యయాన్ని రూ.1726 కోట్లకు ఎలా పెంచారంటూ ఘాటూగా ప్రశ్నించారు. కేవలం మౌఖిక ఆదేశాలతో రూ.626 కోట్ల వ్యయం పెంచడంపై సీరియస్ అయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా అంచనా వ్యయం పెంచడమేంటని ప్రశ్నించారు. నిర్మాణ వ్యయంపై పూర్తిస్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా యుద్ధప్రాతిపదికన హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేయాల్సిందేనని నిర్మాణ సంస్థకు తేల్చి చెప్పారు.





## పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్, టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మెయిన్ రోడ్ పై నిర్మిస్తున్న కాల్వ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ రోడ్డులో అటు 50 ఫీట్లు ఇటు 50 ఫీట్లు కాల్వ నిర్మాణ కొలతలు పరిశీలించడం జరిగిందన్నారు. పాలకేంద్రం నుంచి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వరకు 50 ఫీట్ల మీదనే నిర్మాణం చేపడుతున్నామని ఎవరూ కూడా వదంతులు నమ్మవద్దని, పట్టణ ప్రజలందరూ పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఒక దగ్గర 48 ఫీట్లు ఒక దగ్గర 50 ఫీట్లు నిర్మాణం చేపడుతున్నట్లు ఫిర్యాదులు అందినందున కొలతలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. పట్టణ ప్రజలు ఎవరు కూడా అధైర్యపడవద్దని, పట్టణ ప్రజలందరూ పట్టణాభివృద్ధికి భాగస్వామ్యులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రంజిత్, టౌన్ ప్లానింగ్ అధికారి ఖురేషి, కాంట్రాక్టర్ చంద్రయ్య పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు అధికారుల తనిఖీలు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** పట్టణంలో వక్ఫ్ బోర్డు అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. డోర్నకల్ మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన బీజేపి నాయకులు కాపరబోయిన సత్యనారాయణ ఫిర్యాదుతో స్పందించిన వక్ఫ్ బోర్డు జాతీయ సర్వే కమిషన్ ఆదేశాల మేరకు పట్టణంలోని కబరస్తాన్ ఎదుట నుంచి మసీద్, మండల విద్యావనరుల కేంద్రం, సినిమా హాల్ (సర్వే నంబర్లు 135, 136, 137, 5) ఏరియాల్లో తనిఖీలు నిర్వహించారు. వక్ఫ్ జిల్లా ఆధికారి జమీర్ ఉద్దిన్, అసిస్టెంట్ ఐఏ షేక్ సలీం, దత్తు, మైనార్టీ నాయకులు అస్గర్ తదితరుల పాల్గొన్నారు.

## రేపు వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లి. మహాజన సభ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రేపు ఉదయం 11 గంటలకు వరంగల్ దేశాయిపేట రోడ్డు, పోచమ్మమైదాన్ లోని కేఆర్ గార్డెన్లో వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లి, వరంగల్ మహాజన సభ సమావేశం నిర్వహించనున్నట్లు బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు తెలిపారు. ఈ సమావేశంలో బ్యాంకు 2023-24 సంవత్సర వార్షిక నివేదిక పరిశీలన, ఆమోదం, 2023-24 సంవత్సర ఆదాయ, వ్యయాల పరిశీలన, ఆమోదం, 2024-25 కు అంచనా బడ్జెట్ పరిశీలన, ఆమోదం తెలపనున్నారు. బ్యాంకు ప్రస్తుత రిజిస్టర్డ్ బైలాలోని నెం.2నకు సవరణ చేసి పరిశీలించి ఆమోదం తెలిపనున్నట్లు వారు పేర్కొన్నారు. బ్యాంకు వివిధ నిల్వలను తిరిగి రాయబడిన పద్దుల, 964 సంవత్సర తెలంగాణ సహకార సంఘాల చట్టానికి చేయబడిన రెండవ సవరణ చట్టం 2001 (సెకండ్ అమెండ్ మెంట్ ఆక్ట్ 2007) లోని సెక్షన్ 45 ప్రకారం నికర లాభాల పంపిణీ, పరిశీలన, ఆమోదం, తేది 26-06-2023 నుంచి14-06-2024 మధ్యకాలంలో చేరిన నూతన సభ్యులకు వాటాల కేటాయింపు, సభ్యత్వంపై సమీక్ష ఉంటుందని తెలిపారు. కాబట్టి, వాటాదారులందరూ సకాలంలో మహాజనసభ సమావేశానికి హాజరై దిగువ వివరించిన చర్చనీయాంశాలపై చర్చించి తీర్మాణాలను ఆమోదించగలరని ఎర్రబెల్లి ప్రదీప్ రావు కోరారు.

# నిర్మాణాత్మక ప్రజా పోరాటాలు చేపట్టాలి

### ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి, గాదగోని రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నిర్మాణాత్మక ప్రజా పోరాటాలు చేపట్టాలని, పార్టీ సభ్యుల శాఖల కదలికలను పెంచాలని వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యుల శిక్షణ తరగతుల్లో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. ప్రజలు తమ దైనందిన జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పార్టీ కార్యకర్తలు అండగా నిలిచి, నిర్మాణాత్మక ప్రజా ఉద్యమాలను చేపట్టాలని గాదగోని రవి పిలుపునిచ్చారు. శనివారం ఎంసీపీఐ(యూ) వరంగల్, హనుమకొండ ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యుల పార్టీ నిర్మాణ శిక్షణ తరగతులు వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్ అధ్యక్షతన వరంగల్ లోని ఓంకార్ భవన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా గాదగోని రవి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ఓట్లు సీట్లు అధికారమే లక్ష్యం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అనునిత్యం శ్రమజీవులకు అండగా ఉండి ఎక్కడికక్కడ ప్రజా పోరాటాలను చేపట్టాలన్నారు. అందుకోసం పార్టీ సభ్యులను, శాఖలను స్థానిక కమిటీల కదలికలు పెంచాలని కోరారు. ఏనాటికైనా ప్రజల సమస్యల శాశ్వత పరిష్కారం కేవలం మార్క్సిజంతోనే సాధ్యమన్నారు. ఇది చరిత్ర చెప్పిన సత్యమని, ఆ దిశలో కార్మిక కర్షక ఐక్యత నెలకొల్పుతూ బూర్జువా భూస్వామ్య పెట్టుబడిదారీ పాలకుల నిజస్వరూపాలను బట్టబయలు చేస్తూ ప్రజల్ని చైతన్యవంతం చేయాల్సిన గురుతరమైన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. రోజురోజుకు పెరిగిపోతున్న కుల, మత, ఆర్థిక, సాంస్కృతిక అంతరాలను, వాటిని పెంచి పోషిస్తున్న మతోన్మాద పెట్టుబడిదారీ పాలకులను ఎండగడుతూ పార్టీ సభ్యులు శాఖల్లో కమిటీల్లో మరింత చైతన్యాన్ని పెంపొందించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలయ్యేంత వరకు నిరంతరం ప్రజా ఆందోళనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లా కార్యదర్శులు పెద్దారపు రమేష్, ఎన్ రెడ్డి హంసా రెడ్డి, ఉమ్మడి జిల్లా నాయకులు గోనె కుమారస్వామి, కుసుంబ బాబూరావు నాగెల్లి కొమరయ్య, నీల రవీందర్, కర్ర రాజిరెడ్డి, వంగల రాగసుధ, మాస్ సావిత్రి, కన్నం వెంకన్న, సుంచు జగదీశ్వర్, సింగతి మల్లికార్జున్, ఎమ్మెస్ రావు, కందికొండ కుమార్ స్వామి, ఎండీ ఇస్మాయిల్, కొత్తకొండ రాజమౌళి, కేశెట్టి సదానందం, ఎల్లబోయిన రాజు, జన్ను రమేష్, మాలి ప్రభాకర్, ఎగ్గెని మల్లికార్జున్, చీపురు ఓదెలు, మంద భద్రయ్య, వరికెల కిషన్, బత్తిని కుమారస్వామి, దామ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆరు నెలల్లోనే ప్రభుత్వానికి ఇంత భయమా ?



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాబోయే ఐదేండ్లలో మేము ప్రజల పక్షాన చేసే లడాయి చూస్తే పాలకుల లాగులు తడుస్తయేమో, పేరుకేమో ప్రజా ప్రభుత్వం.. చూడబోతే విద్యార్థుల అక్రమ నిర్బంధమని కేయూ బీఆర్ఎస్వీ ఇంచార్జి జెట్టి రాజేందర్ మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉద్యమ పార్టీ ఉంటే ప్రభుత్వానికి ముచ్చెముటలు పడుతున్నాయని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీది ప్రజా ప్రభుత్వమే కదా.. మరి మీ వరంగల్ జిల్లా పర్యటనకు ఇంత పోలీసు పహారా ఎందుకని ప్రశ్నించారు. మాకు ఈ నిర్బంధాలు, పోలీసుల బైండోవర్లు కొత్తేమీ కాదన్నారు. యూనివర్సిటీ విద్యార్థుల అక్రమ అరెస్టులు చూస్తే అర్థమవుతుంది. ఈ రాష్ట్రంలో రాబందుల పాలన నడుస్తుందని అని ప్రజలందరికి తెలుస్తుందన్నారు. కాకతీయ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి, భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం క్యాంపస్ ఇంర్జి జెట్టి రాజేందర్ ను హాసన్ పర్తి మండలం బైరాన్ పల్లి గ్రామంలోని వారి నివాసంలో యూనివర్సిటీ సబ్ ఇన్ స్పెక్టర్లు రాజ్ కుమార్, సురేష్ అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేయూ పోలీస్ స్టేషన్ కు వారిని తరలించారు.

## డ్రైనేజీల వెంట మట్టిని సమాంతరంగా నింపాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 40వ డివిజన్ దసరా రోడ్డులో స్మార్ట్ సిటీ పనుల కింద నిర్మిస్తున్న డ్రైనేజీలు ఇంటి యజమానులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, డ్రైనేజీకి రోడ్డుకు మధ్యన ఎగుడు దిగుడు లేకుండా రాళ్లను తొలగించి సమాంతరంగా మట్టిని నింపాలని కాంట్రాక్టర్ సిబ్బందికి 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. కొందరి ఇండ్ల ముందు రాళ్లు వేశారని, సమాంతరంగా మట్టిని పోయనందున ఎగుడు దిగుడుగా ఉండటం వలన నడవడానికి వీలు లేకుండా ఉందని ఇంటి యజమానులు అందరూ కార్పొరేటర్ మరుపల్ల రవి దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే స్పందించిన మరుపల్ల రవి దసరా రోడ్డు ప్రాంతాన్ని సందర్శించి పై విధంగా అన్నారు. నిర్మాణంలో మిషన్ భగీరథ కనెక్షన్లు తొలగిపోతే వెంటనే అమర్చాలని వాటర్ లైన్ మెన్ సమ్మయ్యకు సూచించారు. స్థానికులు దాసి సదానందం, రవి, జవాన్ ప్రశాంత్ ఉన్నారు.

# కార్పొరేట్ హాస్పిటల్ ప్రారంభోత్సవం ఆంతర్యమేంటీ?



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ప్రభుత్వ హాస్పటల్ ను అభివృద్ధి చేయాల్సింది పోయి కార్పొరేట్ హాస్పిటల్ ను ముఖ్యమంత్రి ప్రారంభించడంలో ఆంతర్యం ఏమిటని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి తిరుపతి ప్రశ్నించారు. హనుమకొండ కుమార్ పల్లిలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో యూత్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. ప్రభుత్వ హాస్పటల్ పట్ల ప్రజలకు నమ్మకం కలిగించాల్సింది పోయి ప్రైవేటు కార్పొరేట్ హాస్పిటల్లో వైద్య వ్యాపారాన్ని పెంచి పోషించే విధంగా ముఖ్యమంత్రి స్థాయిలో హాస్పిటల్ ను ప్రారంభించడం అంటే ప్రభుత్వ వైద్యశాలలను విస్మరించినట్టు అవుతుందని మండిపడ్డారు. ప్రైవేటు హాస్పిటళ్ల దోపిడీ ఇంకా పెరిగిపోతుందని, ఇప్పటికే వైద్యం పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్న ప్రైవేటు వైద్యశాలల పట్ల ప్రభుత్వం ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడం, మళ్లీ వారిని ప్రోత్సహించే విధంగా ముఖ్యమంత్రి హాస్పిటల్ ను ప్రారంభించడం అంటే కార్పొరేట్ హాస్పిటళ్ల యజమాన్యాలు దోపిడీలో రెచ్చిపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా పాలన అంటూ చెప్పుకునే ప్రభుత్వం ప్రజల సౌకర్యాల గురించి ఆలోచించాల్సింది పోయి ప్రజలను ఇబ్బందులకు గురి చేసే కార్పొరేట్ హాస్పిటళ్లను ప్రారంభించాల్సిన అవసరం ఏం ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రారంభించే మెడికవర్ హాస్పిటల్ ఏమైనా పేదలకు ఉచిత వైద్యం అందిస్తుందా అని ప్రశ్నించారు. దానికోసం అంత సమయం వెచ్చించాల్సిన అవసరం ఏముందని, అదే సమయం ప్రజల కోసం కేటాయిస్తే ప్రజా సమస్యలైనా తెలిసేవని అన్నారు. ప్రభుత్వ హాస్పిటల్ ను ప్రోత్సహించి కార్పొరేట్ హాస్పిటల్లో వైద్య వ్యాపారం పట్ల దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి, జిల్లా కమిటీ సభ్యులు మాటూరి సతీష్, నాయకులు అనిల్, రవితేజ, రాజేందర్, సంతోష్ పాల్గొన్నారు.

# నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

## పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లాలో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాల సమీకృత కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణ పనులలో వేగం పెంచాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మంత్రి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాల, సమీకృత కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిర్మాణ పనులలో వేగం పెంచాలని, అవసరమైతే అదనపు వర్కర్స్ తో పనులు చేయించాలని, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణ పనులు డిసెంబర్ మాసంలోపు పూర్తి చేసి అధికారులకు అందించాలని, నూతన కలెక్టరేట్ వచ్చే రహదారి కూడా వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నూతనంగా మెడికల్ కళాశాలలో ఎన్ని కోర్స్ లు అందుబాటులో ఉంటాయి, ఎంత మంది విద్యార్థులు వచ్చే అవకాశం ఉంది, వారికి అందించే సదుపాయాలు ఎలా ఉంటాయి అనే తదితర అంశాలను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మోహన్ లాల్, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ జగదీశ్వర్, ఆర్అండ్ బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ సీనియర్ నేత డీఎస్ కన్నుమూత

### ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

### నిజామాబాద్‌కు భౌతిక కాయం తరలింపు

### రేపు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూశారు. గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న డీఎస్ శనివారం తెల్లవారుజామున 3 గంటలకు తుదిశ్వాస విడిచారు. దీంతో బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఆయన స్వగృహానికి భౌతికకాయాన్ని తరలించారు. మధ్యాహ్నం 2 గంటల వరకు పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం నిజామాబాద్ పట్టణానికి తరలిస్తారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన సొంత నియోజకవర్గమైన ఇందూరు పట్టణంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఇదే విషయాన్ని కుటుంబ సభ్యులు కూడా వెల్లడించారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఢిల్లీలో ఉన్న ఆయన కుమారుడు, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ మధ్యాహ్నానికి హైదరాబాద్ చేరుకున్నారు. అనంతరం డీఎస్ భౌతిక కాయాన్ని ప్రజలు, అభిమానుల సందర్శనార్థం నిజామాబాద్‌కు తరలించనున్నారు. డీఎస్ మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీ హనుమంతరావు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. డీఎస్ భౌతికకాయానికి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్, తదితరులు డీఎస్ ఇంటికి వెళ్లి నివాళి అర్పించారు.

# నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



**వరంగల్ వాయిస్, దొర్నకల్ :** విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో కూడిన నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం నర్సింహా రావు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని జడ్పీ స్కూల్ లో జరిగిన విద్యార్థుల ఎలక్షన్ డే కార్యక్రమంలో పాఠశాల నూతన విద్యార్థుల కమిటీని ఎన్నుకున్నారు. విద్యార్థులందరూ కలిసి లీడర్‌ను ఎంచుకోవడంలో ఒక సమదృష్టి పాటించడమే కాకుండా ఓటింగ్ విధానాన్ని కూడా అలవర్చుకోవడానికి ఈ ఎలక్షన్ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. ఆయా తరగతుల వారీగా విద్యార్థులు తమ ఓటింగ్ ద్వారా నాయకుడిని ఎంచుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువను ఉపాధ్యాయులు తెలియజేశారు. కార్యక్రమంలో కృపా కాంత్, అనిత, వసంత రాణి, కమల, గ్రేస్, సమిత, అమీన, మంజు లత, శేష కుమారి, దమయంతి, అప్పిరెడ్డి, సోమసబోయిన శ్రీనివాస్, శంకరయ్య, శంకర్, రవికుమార్, బిచ్చు నాయక్, సీతా రాములు తదితరులు పాల్గొన్నారు.

# అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజలను ఆర్థిక క్షోభకు గురి చేస్తున్నారని దళిత నిరుపేద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింగారపు ప్రేమ్ కుమార్ ఆరోపించారు. శనివారం డివిజన్ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పట్టణ కేంద్రంలోని ఫీజులు వసూలు చేస్తున్న పలు పాఠశాలలపై నియంత్ర చట్టం తీసుకొచ్చి పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత విద్యను అందించాలని, విద్య హక్కు చట్టాన్ని అమలు పరిచేలా అధికారులు చొరవ తీసుకొని పేద మధ్యతరగతి విద్యార్థులకు అందించాలని ఆయన కోరారు. అలాగే ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలో 50 శాతం ఫీజు మాత్రమే తీసుకొని హాస్టల్ వసతి కూడా కల్పించాలని ఆయన అన్నారు. స్పోర్ట్స్, డెస్క్ బుక్స్, లైబ్రరీ, వ్యాన్, ఎగ్జామినేషన్ ఫీజ్, యూనిఫామ్ ఇతర డొనేషన్ పేర్లతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని వీరిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నిరుపేద సంఘం జిల్లా అధ్యక్షుడు బందు వెంకన్న, అశోక్, యాకన్న, మల్లేశు, బాబు, రామచంద్రు పాల్గొన్నారు.

# కేంద్ర పథకాలను గడప గడపకు చేర్చాలి

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాయపర్తి మండలం పెరికేడు గ్రామంలో భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. రవికుమార్ మాట్లాడుతూ మన ప్రియతమ భారత ప్రధాని నరేంద్ర మోడీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడప గడపకు వేరే విధంగా బూత్ స్థాయిలో ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగా రామ్మోహన్ రెడ్డి, జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ర శ్రీనివాస్ రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి పూసర్ల శ్రీమాన్, మండల అధ్యక్షులు వడ్లకొండ రవి, మండల నాయకులు నూనె అనిల్, వివిధ మోర్చా నాయకులు, పలు గ్రామాల నాయకులు, బీజేవైఎం నాయకులు, గ్రామ ప్రజలు యువత పాల్గొన్నారు.

# గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని పలు గ్రామాలలో స్థానికులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యాసిశ్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిల ఆదేశాల మేరకు శనివారం అమర్ సింగ్ తండాలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గ్రామ పెద్దలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సహకారంతో గ్రామంలో సమస్యలు పరిష్కారం చేస్తామన్నారు. గ్రామాలలో సమస్యలు ఉంటే స్థానిక అధికారులతో మాట్లాడి పరిష్కారం చేస్తామన్నారు. పెన్షన్లు స్థానికంగా ఇచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు హపావత్ గోపి నాయక్, మాజీ ఎంపీటీసీ జాటోత్ నాను, మాజీ సర్పంచ్ హపావత్ సురేష్ నాయక్, మండల యూత్ నాయకులు హపావత్ సురేందర్ నాయక్, జాటోత్ బిచ్చా, భూక్యా రమేష్, మోహన్, జాటోత్ సుందర్, జాటోత్ దంజి, మంజీ, భాను, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# దొంగను పట్టుకున్న స్థానికులు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని పుప్పాల గుట్టలో నిన్న రాత్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంటికి దొంగతనానికి వచ్చిన దొంగను స్థానికులు చాకచక్యంతో పట్టుకొని పోలీసులకు అప్పజెప్పారు. వివరాల్లోకి వెళ్తే వరంగల్ పుప్పాల గుట్టలో అర్ధరాత్రి టవల్ పై వచ్చి తాళం వేసిన ప్రభుత్వ టీచర్ ఇంటి ముందు దొంగ హల్ చల్ చేశారు. భయభ్రాంతులకు గురైన పుప్పాల గుట్ట వాసులు దొంగని పట్టుకొని కట్టేసి కొట్టారు. దొంగతనానికి పాల్పడే దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. మిల్స్ కాలనీ పోలీసులు దుండగుడిని అదుపులో తీసుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

# వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



**వరంగల్ వాయిస్, చిల్పూరు :** జనగాం జిల్లా చిల్పూరు మండలం చిల్పూరు గుట్టలోని శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి కళ్యాణాన్ని దేవస్థాన అర్చకులు వేద మంత్రోచ్చరణలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు కళ్యాణాన్ని కన్నుల పండుగగా తిలకించారు. వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పాల్గొన్నారు. శ్రీ స్వామివారి కళ్యాణం అనంతరం అన్న ప్రసాద వితరణ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బి.లక్ష్మీ ప్రసన్న, ముఖ్య అర్చకులు బి.రవీందర్ శర్మ, అర్చకులు సౌమిత్రి శ్రీరంగాచార్యులు, కృష్ణమా చార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. హైదరాబాద్ కు చెందిన ఇసుకపల్లి వెంకటేశ్వర్లు–లలిత కుమారి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు.

## సంపత్ రావుకు బీజేపీ నేతల పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** ప్రముఖ వ్యాపారవేత్త, ఎన్ఎస్ఆర్ గ్రూప్స్ అధినేత నాయినేని సంపత్ రావును బీజేపీ రాష్ట్ర నాయకులు శనివారం పరామర్శించారు. సంపత్ రావు గారి తండ్రిగారు నాయినేని రామారావు మరణించిన విషయం తెలుసుకొని బీజేపీ రాష్ట్ర నాయకులు పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ బీజేపీ, ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు, ఈటల రాజేందర్ సతీమణి ఈటల జామున గూడెప్పాడులో ఆయన ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పగడాల రాజ్ కుమార్, ఆత్మకూర్ మండల ప్రెసిడెంట్ బలవంతుల రాజకుమార్, పైడి ఆచారి పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై సీఎం స్పందించాలి

### ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యారంగ సమస్యల పైన సీఎం స్పందించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ అన్నారు. శనివారం హనుమకొండ హరిత కాకతీయ హొటల్ లో ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ వరంగల్ జిల్లా పర్యటనకు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలో ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని అన్నారు. జిల్లాలో విచ్చలవిడిగా ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అక్రమంగా ఫీజుల దోపిడీ చేస్తున్న విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదన్నారు. విద్యాశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రైవేట్ విద్యాసంస్థలతో కుమ్మక్కై విద్యార్థుల తల్లిదండ్రులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా పర్యటనకు వస్తున్న సీఎం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని, ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టాలని కోరారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్రం కోసం చదువును సైతం పక్కన పెట్టి పోరాడినా డీఎస్సీ అభ్యర్థులకు కేసీఆర్ ప్రభుత్వంలో ఉద్యోగాలు వేయకుండా మోసం చేస్తే విద్యార్థి, నిరుద్యోగ యువత కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడించి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందనీ ఎదురు చూస్తుంటే డీఎస్సీ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులకు టీచర్ ఉద్యోగాలు పెంచకుండా అన్యాయం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పరీక్ష తేదీలను ప్రకటించడం చాలా బాధకరమని అన్నారు. డీఎస్సీ పరీక్షలను వాయిదా వేసి ఎక్కువ పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సంక్షేమశాఖ హాస్టల్స్ విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం, వసతులు కల్పించాలని ముఖ్యమంత్రిని కోరారు. స్టూడెంట్ మేనేజ్ మెంట్ హాస్టల్ విద్యార్థులకు సొంత భవనాలు నిర్మించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు అండగా ఉండి వారికీ న్యాయం చేయకుంటే ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఏఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ధార సురేష్, కాకతీయ యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శి బండారి పృథ్వీ, కాకతీయ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు అర్షం చరణ్, నాయకులు రాజు, సందీప్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో పేదోడికి అన్యాయం

### బీజేపీ ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్ కుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రైవేట్ హాస్పిటల్ లకు కొమ్ముకాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వరంగల్ లో ప్రైవేట్ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి సీఎం రావడం విడ్డూరమని బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్ కుమార్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో కేఎంసీలో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎంజీఎం ఆసుపత్రిలో వసతులు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని మండిపడ్డారు. గవర్నమెంట్ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వసతులు ఏర్పాటు చేయాలని భారతీయ జనతా పార్టీ పక్షాన డిమాండ్ చేశారు.

## ఘనంగా వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మహాజన సభ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అఫిక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అధ్యక్షతన శనివారం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మార్నేని రవీందర్ రావు మాట్లాడుతూ బ్యాంకు పరిపాలన నివేదిక, ఆర్థిక సంవత్సరం 2023-24నకు జారీ చేయబడిన ఆడిట్ సర్టిఫికెట్, బ్యాంకు జమ, ఖర్చు, లాభనష్టాలు, ఆస్తులు, అప్పుల మహాజన సభ ముందు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. పాలకవర్గ సభ్యులు బాధ్యత చేపట్టిన తర్వాత బ్యాంకు వ్యాపారం 131 శాతం అభివృద్ధి సాధించిందని ఈ సందర్భంగా తెలియజేశారు. టీఎస్ సీఏబీ చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలు సహకార సంఘాల చైర్మన్లు, సహకార శాఖకు సంబంధించిన ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారన్నారు. అనంతరం జేడీఏ ఉషా దయాల్, జిల్లా సహకారి అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న రైతుబంధుపై తమ అభిప్రాయాలను వెల్లడించేందుకు సంఘాలలో స్పెషల్ జనరల్ బాడీ మీటింగ్ ని ఏర్పాటు చేయాల్సిందిగా ప్రభుత్వం సూచనలు జారీ చేసిందిగా తెలిపారు. ఈ సమావేశంలో బ్యాంక్ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్ రెడ్డి, డైరెక్టర్లు సంపెల్లి నర్సింగరావు, కంది శ్రీనివాస్ రెడ్డి, కేసిరెడ్డి ఉపేందర్ రెడ్డి, కక్కిరాల హరిప్రసాద్, చెట్టుపల్లి మురళీధర్, గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, దొంగల రమేష్, నాయిని రంజిత్, మాడుగుల రమేష్, ఎర్రబెల్లి గోపాలరావు, పోలిపాక శ్రీనివాస్, కే.నరేందర్, ఎలుగం రవి రాజా, ప్రదీప్ చందర్, అగ్రికల్చర్ జేడీఏ ఉషా దయాల్, రవీందర్ సింగ్, డిస్టిక్ కోపరేటివ్ ఆఫీసర్లు నాగేశ్వరరావు, సంజీవరెడ్డి, శైలజ,వెంకటేశ్వర్లు, రాజేందర్ రెడ్డి, పశు సంవర్ధక శాఖ నుంచి నారాయణ, బాలకృష్ణ, బాలకిషన్, హార్టికల్చర్ శాఖ నుంచి అరుణ్, బీవీ.రమణ, ఫిషరీస్ డిపార్ట్ మెంట్ నుంచి నాగమణి, అవినాష్, సహకార సంఘాల చైర్మన్లు, బ్యాంకు సీఈఓ, ఎండీ.వాజిర్ సుల్తాన్, జీఎం శ్రీధర్, డీజీఎం అశోక్, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయించాలి

### ఎమ్మెల్యే నాయినికి ఏఐఎస్ఎఫ్ వినతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు విడుదల చేయాలని శనివారం ఉదయం ఆయనను క్యాంప్ ఆఫీసులో ఏఐఎస్ఎఫ్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న రూ.7 వేల కోట్ల పై చిలుకు స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలనీ, నిధులు ఇవ్వకపోవడం ద్వారా గత మూడు సంవత్సరాలుగా 2021 -2022 విద్యా సంవత్సరంలో సగం బకాయిలు, 2023- 2024 మొత్తం బకాయిలు విడుదల కావాల్సి ఉందన్నారు. దీని వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ కోర్సు పూర్తి చేసిన కూడా వారి సర్టిఫికెట్లు కళాశాల యాజమాన్యాలు ఇవ్వడం లేదు. ఉన్నత చదువులకు, ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న వారికి ఇబ్బందికరంగా మారింది. కాబట్టి, ఈ విషయంలో మీరు నేడు జిల్లాకు అభివృద్ధి శంకుస్థాపనకు వస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి విద్యార్థులకు న్యాయం చేయాలని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషాబోయిన సంతోష్ ఎమ్మెల్యేకి వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు కుక్కల కుమార్, జిల్లా సమితి సభ్యులు కుంటి పవన్, మాలోతు శ్రీనివాస్, శివ, నక్కల హేమంతులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో ఇంతటి నిర్బంధమా.?

### గృహ నిర్బంధంపై బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజా పాలనలో పోలీస్‌ల పహారాలు, నిర్బంధాలు ఎందుకు అని బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం అంటూ బీరాలు పలుకుతూ ప్రతిపక్ష నాయకులపై ఈ అంక్షలు ఎందుకు అని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా ఏనుగుల రాకేశ్ రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. రాకేశ్ రెడ్డి సహా 40 మంది మంది ముఖ్య కార్యకర్తల నిర్బంధించారు. దీంతో ప్రభుత్వం తీరుపై రాకేశ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు నెలల పాలనకే ఇంత అభద్రతాభావమా.. ఇంతటి అరాచకమా? అని ఏనుగుల రాకేశ్‌రెడ్డి మండిపడ్డారు. ముఖ్యమంత్రి సహా సగం కేబినెట్, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఓ ప్రైవేటు హాస్పిటల్ ఓపెనింగ్ కోసం ఎగవేసుకుని వస్తున్నారని.. అయినప్పటికీ వరంగల్‌కు సీఎం వస్తున్నాడన్న వాతావరణమే ఎక్కడా కనిపించడం లేదని విమర్శించారు. కాకతీయ కళా తోరణం రాచరిక దర్పం అన్న వ్యాఖ్యలు ఓరుగల్లు ప్రజలను తీవ్రంగా బాధించాయని ఏనుగుల రాకేశ్ రెడ్డి అన్నారు. కాబట్టి, సీఎం రేవంత్ రెడ్డి ఆ మాటలు వెనక్కి తీసుకొని, ఓరుగల్లు ప్రజలకు బేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వరంగల్ దాటేలోగా కాకతీయ తోరణం తొలగింపుపై స్పష్టత ఇవ్వాలన్నారు. లేకపోతే, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులంతా రేవంత్ రెడ్డి ఇంటి ముందు టెంటు వేసుకొని ధర్నా చేయాలని సూచించారు. లేదంటే మీ క్యాంప్ ఆఫీస్‌ల ముందు ప్రజలు కుర్చుకుంటారని చెప్పారు. కడుపు మీద కొట్టినా ఓర్చుకుంటాం. కానీ, మా ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు.

## కుసుమ జగదీష్ ప్రథమ వర్ధంతి

### హాజరైన దాస్యం, మర్రి యాదవరెడ్డి



**వరంగల్ వాయిస్, ములుగు :** మల్లంపల్లి మండలంలో ములుగు జిల్లా జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కుసుమ జగదీష్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభ కార్యక్రమంలో పాల్గొని, కుసుమ జగదీష్ చిత్రపటానికి బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం నిరంతరం కష్టపడుతూ ఈ స్థాయికి ఎదగాడన్నారు. ఉద్యమకారుడిగా మాతో పాటు అనేక కార్యక్రమాలలో పాల్గొన్న గత స్మృతులను నెమరు వేసుకున్నారు. తాను లేని లేటు బాధాకరమని, ఎంతో భవిష్యత్తు ఉండేదని జగదీష్ కుటుంబానికి ఎల్లవేళలా సహాయ, సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు నాయకులు కొండపాక రఘు, శ్రీనివాస్, రమణ, కుసుమ సూర్య కిరణ్, కేయూ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు బైరోని వినయ్, కొనకటి ప్రశాంత్, కొమరం సిద్దుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పీవీ స్మారక అవార్డు ప్రదానోత్సవం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారతదేశ పూర్వ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు 103 వ జయంతి సభను ఆబోప ఆధ్వర్యంలో నక్కలగుట్టలోని వరంగల్ దర్శన్ సెమినార్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఆబోప అధ్యక్షుడు మోత్కూరు మనోహర్ రావు మాట్లాడుతూ ఆబోప గత 8 సంవత్సరాల నుంచి పీవీ జయంతి జూన్ 28న ప్రముఖ సాహితీ ప్రముఖులకు పీవీ స్మారక అవార్డు అందిస్తున్నట్లు గతంలో ఆచార్య ఎస్ లక్షణమూర్తి, మహా సహస్రావధాని గరికపాటి నరసింహారావు, ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య, పాలకుర్తి మధుసూదనరావు, డా.పాలకుర్తి దినకర్, డా.వి.వి.రామారావు లకు అందజేసినట్లు తెలియజేశారు. ఈ సంవత్సరం సాహితీవేత్త, బహుగ్రంధకర్త విశ్వేశ్వర సంస్కృతాంధ్రకళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డా.యల్లంభట్ల నాగయ్యకు అందజేస్తున్నట్లు తెలిపారు. అవార్డు సెలక్షన్ కమిటీ చైర్మన్ గిరిజా మనోహర బాబు మాట్లాడుతూ పీవీ భారతదేశమందే కాదు, ప్రపంచదేశాలచే కొనయాడబడిన మహానేత అని, వారు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశానికి దశాదిశానిర్దేశం కలగజేశాయని తెలిపారు. ముఖ్యఅతిథి పాములపర్తి సదాశివరావు మాట్లాడుతూ పీవీతో తనకున్న సాన్నిహిత్యాన్ని, వ్యక్తిత్వాన్ని కూలంకశంగా వివరించారు. ఇప్పటికి పీవీ మౌనం వెనుక అర్థాన్నితను తెలుసుకోలేకపోతున్నానని, బహుశా అది ఎవరికీ సాధ్యం కాక పోవచ్చని తెలిపారు. ఆచార్య బన్న అయిలయ్య పీవీ.రాజకీయ సాహిత్య వైభవాన్ని వివరించారు. అవార్డుప్రదానోత్సవ స్వీకర్త డా.యల్లంభట్ల నాగయ్య మాట్లాడుతూ ఆబోప అవార్డు కమిటీ తనను ఎంపికచేయడం, అంతటి మహావ్యక్తి పేర అవార్డు స్వీకరించడం తనకెంతో గర్వకారణమని పేర్కొన్నారు. ఆబోప అవార్డు ప్రాయోజకులు మోత్కూరు ఇందిరా మనోహర్ రావుకు కృత్ఞతలు తెలిపారు. ఇంకా ఈ సభలో ప్రముఖ సాహితీవేత్తలు దహాగాం సాంబమూర్తి, గురునాథం, అశోక్ , వేంకటేశ్వర్లు, శ్రీనివాస మూర్తి,పేర్వారం శంకరరావు, లక్ష్మీనరసయ్య, పల్లేరు వీరస్వామి, సుబ్రహ్మణ్యం, వరిగొండ కాంతారావు, గణపతి శర్మ, సదానందం, ముదిగొండ విశ్వనాథం, ఆబోప కార్యవర్గ సభ్యులు డా.పాలకుర్తి దినకర్, లక్ష్మీనరసింహమూర్తి, జి.జయప్రసాద్ రావు, ముసిపట్ల శ్రీనివాసరావు, సుదర్శన్ రావు, రామలింగేశ్వర్ రావు, సోంబాబు, మోత్కూరు రామేశ్వర్ రావు, పెండెం వేణుమాధవ్, ప్రవీణ్, శ్రీకాంత్, వెంకట్, రవీందర్ రావు, ప్రకాశ్ రావు, మహిళా సభ్యులు ఇందిర, వేదాంతం శ్రీదేవి, ఉమ, శైలజ, మధూలిక, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకుల అరెస్ట్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా విద్యార్థి నాయకులు అక్రమంగా అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలని నెరవేర్చాలని, గ్రూప్-2, రెండు వేల ఉద్యోగాలు, గ్రూప్-3, మూడు ఉద్యోగాలకు సంఖ్యను పెంచాలని, నిరుద్యోగులకు ఇచ్చిన 25వేలతో మెగా డీఎస్సీ విడుదల చేయాలని, జీవో 46ను రద్దు చేస్తానని గతంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా పాలనలో అక్రమంగా అరెస్టులు ఏంటని ప్రశ్నించారు, అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను కేయూ పోలీస్ స్టేషన్ తరలించారు. అరెస్టైన వారిలో బైరపాక ప్రశాంత్, మాచర్ల శరత్ చంద్ర, సంగని సూర్య కిరణ్, కంజర్ల మనోజ్, అరూరి రంజిత్, జెట్టి రాజేందర్, గంద్రకోట రాకేష్ యాదవ్, గొల్లపల్లి వీరస్వామి, పబోజ్జు శ్రీకాంత్ చారి, నరేందర్, శ్రవణ్, స్నేహిత్, కళ్యాణ్, రాకేష్, తదితరులు ఉన్నారు.

## బావి మోటార్ల విషయంపై గలాట

### ఎంపీఓకు ఫిర్యాదు చేసిన తండా వాసులు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** అందనాలపాడు గ్రామ పంచాయతీలోని సీత్లతండాకు చెందిన రూప్ సింగ్ తన వ్యవసాయ బావి నుంచి నీరు తీసేందుకు వినియోగించే మోటర్లు తీసివేయమని కార్యదర్శి ఆదేశించటం వలన అన్యాయం జరుగుతుదని అవేదన వ్యక్తం చేశారు. గత 10 సంవత్సరాల క్రితం తనకున్న వ్యవసాయ బావి నుంచి తండా ప్రజలకు తాగునీరు అందించేందుకు అనుమతి ఇచ్చామని, ఇప్పుడు తమ వ్యవసాయ మోటర్లను తీసివేయాలని కార్యదర్శి అదేశించటం ఎంతవరకు న్యాయమన్నారు. ఈ విషయంపై తమ తండా వాసులుతో కలిసి ఎంపీఓ మున్వర్ బేగ్ కు సమస్య విన్నవించుకున్నారు. తాగు నీటితో పాటు వ్యవసాయానికి తగిన నీరు ఉన్నప్పటికి తమ వ్యవసాయ మోటర్లు తీసేవేయటం, ఇందుకు నిరాకరించటంతో తండా వాసులుపై కేసులు పెట్టడం తగదన్నారు. ఈ విషయంపై తండా ప్రజలతో విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరారు.

# రైస్ మిల్లులపై అధికారుల తనిఖీలు

### ముగ్గురు మిల్లు యాజమానులపై కేసుల నమోదు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రభుత్వం పలుమార్లు గడువు పెంచినా రైస్ మిల్లర్లు వానాకాలం , యాసంగి సీజన్ల కు సంబంధించి ప్రభుత్వానికి ప్పగించవలసిన సీఎంఆర్ ( కస్టమ్ మిల్లింగ్ రైస్ ) ను ప్రభుత్వానికి అప్పగించక పోవడంతో టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి వచ్చిన సివిల్ సప్లైస్ అధికారులు స్థానిక సివిల్ సప్లైస్ అధికారులతో కలిసి కేసముద్రం మండల కేంద్రంలోని మారుతి, మణికంఠ, మహాదేవ్ రైస్ మిల్లులలో తనిఖీలు చేపట్టి రూ.30 కోట్ల 38 లక్షల విలువ చేసే 11 వేల 379 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లుగా గుర్తించి ముగ్గురి మిల్లు యజమానులపై కేసులు నమోదు చేశారు. వానాకాలం, యాసంగి సీజన్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని పౌరసరఫరాల అధికారులు సీఎంఆర్ విధానంలో పలు రైస్ మిల్లులకు కేటాయించారు. రైస్ మిల్లర్లు ధాన్యాన్ని మర పట్టించి బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించవలసి ఉన్నా మిల్లర్లు గడువు ముగిసినా ఉదాసీనంగా వ్యవహరించి ప్రభుత్వానికి అప్పగించకపోవడంతో సదరు రైస్ మిల్లులపై సివిల్ సప్లయి టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అధికారుల ఉదాసీనతగా వ్యవహరించడం వల్ల రైస్ మిల్లుల నిర్వాహకులు సీఎంఆర్ ను సకాలంలో ఇవ్వకుండా జాప్యం చేయడమే గాకుండా బియ్యం మాయం చేయడం జిల్లాలో కలకలం రేపింది. చివరి సారి గడువు ముగిసే లోగానైన సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పజెప్తారేమోనని ఎదురు చూసిన పౌర సరఫరాల శాఖ అధికారులకు ఏకంగా ధాన్యం మాయమవడం మింగుడు పడడం లేదు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన గడువు ముగిసినా సీఎంఆర్ బియ్యాన్ని అప్పగించకపోవడంతో ప్రభుత్వం మరో 3 నెలల వరకు గడువు పెంచింది. ఈ గడువు ముగిసే లోపు అయినా రైస్ మిల్లుల యజమానులు సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగిస్తారో లేదో వేచి చూడాల్సిందే. సివిల్ సప్లయి శాఖ అధికారుల అండదండలు మిల్లర్లకు ఉండడంతో వారు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు. తప్పు చేసిన వారిని రక్షించే వరకు సహకరిస్తుండడంతో జిల్లాలో రూ.30 కోట్ల 38 లక్షల విలువ చేసేదాన్యం మాయమైంది. జిల్లాలో అన్ని రైస్ మిల్లులపై సివిల్ సప్లయి టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపడితే మరిన్ని మిల్లుల బాగోతం బయట పడే అవకాశం ఉందని ప్రజలు కోరుతున్నారు.

## రేపు పీపీఐడీ రాష్ట్ర స్థాయి సమావేశం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** న్యూశాయంపేట పద్మాక్షిరోడ్డులో ఉన్న నందనార్ మాల కళ్యాణ పరిచయ వేదికలో పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమోక్రటిక్) తెలంగాణ రాష్ట్ర స్థాయి సమావేశం జూన్ 30 ఆదివారం ఉదయం 10:00 గంటలకు పీపీఐడీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పోతునూరి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి జాతీయ నాయకులు, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యులు ఎస్ఎస్ డమ్మీ, ఎస్కే సహారే హాజరుకానున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ పునర్నిర్మాణ ఎన్నికలు నిర్వహించనున్నారు. పీపీఐడీ అగ్రనేతలు వరంగల్ మహానగరానికి వస్తున్నారని, ఈ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వాదులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పీపీఐడీ రాష్ట్ర అధ్యక్షుడు పోతునూరి సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో కోరారు.

## కాంగ్రెస్ హయాంలోనే రైతు రాజ్యం



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రైతు రాజ్యం స్థాపన సాధ్యమవుతుందని కాంగ్రెస్ ఓబీసీ మండల అధ్యక్షుడు గంటే రాజుకుమార్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హయాంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిని అమలు చేస్తూ వస్తుందన్నారు. అందులో భాగంగానే రైతు రుణమాఫీ ఒకేసారి రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తుండటం రైతుల్లో, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంతో సంతోషాన్ని నింపుతుందని సంతోషం వ్యక్తం చేశారు. రైతులకు సకాలంలో ఎరువులను, విత్తనాలను ప్రభుత్వం ఇప్పటికే పంపిణీ చేయడం జరిగిందని, ఇంకా పంపిణీ చేస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆధ్వర్యంలో, నియోజక వర్గం ఇంచార్జి సింగపురం ఇందిర సహకారంతో స్టేషన్ ఘనపూర్ అసెంబ్లీ నియోజక వర్గం సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందన్నారు. శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి జిల్లాకు రావడంతో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులో కార్యకర్తల్లో ఎంతో ధైర్యం వచ్చిందని, జిల్లా ప్రజల్లో ఆశలు చిగురెత్తాయన్నారు. జిల్లా అభివృద్ధి, నియోజక వర్గం అభివృద్ధికి బాటలు పడుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రిన్సిపాల్ దివాకర్ సేవలు అభినందనీయం

### ఆయనకు పదవీ విరమణ శుభాకాంక్షలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ దివాకర్ పదవీ విరమణ చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఈ. శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు సంఘ భాధ్యులు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్ దివాకర్ ను కలిసి పుష్ప గుచ్చం అందజేసి, శాలువాతో సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జీజేఎల్ ఏ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఈ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఒక ఉపాధ్యాయుడిగా తన సర్వీసును ప్రారంభించి, స్ఫూర్తిదాయకంగా విధులు నిర్వర్తించి,లెక్షరర్ గా ప్రమోషన్ పొంది, ఇతరులకు ఆదర్శప్రాయంగా, ప్రిన్సిపాల్ గా దివాకర్ సర్వీసును ముగించడం చాలా గొప్ప విషయమని అన్నారు. వారి శేష జీవితం ఆనందంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఐఈఓఏ గోపాల్, జీజేఎల్ఏ జిల్లా అధ్యక్షుడు చాంప్ల, ఉపాధ్యక్షుడు కొమరారెడ్డి, స్టేట్ మెంబర్ మహిపాల్ రెడ్డి, వెంకట రమణ, సంఘ బాధ్యులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** పట్టణ కేంద్రంలో వరంగల్ టు ఖమ్మం రహదారిపై తొర్రూరు బస్టాండ్ సమీపంలో రోడ్డు క్రాస్ చేస్తున్న నంగునూరు నాగన్న (62)ను లారీ (ఏపీ37 టీసీ 9549) ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం వరంగల్ కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నేనాల గ్రామానికి చెందిన వ్యక్తి గా గుర్తించారు.

## పూర్తి కావస్తున్న హరిహరవీరమల్లు

పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న పీరియాడికల్ చిత్రం 'హరిహర వీరమల్లు' 'ధర్మం కోసం యుద్ధం' అనేది ఉపశీర్షిక. తొలుత ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. ఆయన మరో చిత్రంతో బిజీగా ఉండటం వల్ల ఆయన పర్యవేక్షణలో జ్యోతి కృష్ణ సినిమాను పూర్తి చేయనున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన గ్లింప్స్ టీజర్స్, పోస్టర్స్ విపరీతంగా సినిమాకు హైప్ ఇచ్చాయి. సినిమా ఆగిపోయిందని, షూటింగ్ జరగడం లేదని ఎన్ని ప్రచారాలు జరిగినా సినిమాకు క్రేజ్ మాత్రం తగ్గలేదు. నెగటివ్‌గా పబ్లిసిటీ జరిగిన ప్రతిసారీ చిత్రం బృందం అప్‌డేట్ ఇస్తూనే ఉంది. ఇప్పటికే ఈ చిత్రం 50 శాతానికి పైగా చిత్రీకరణ పూర్తయింది. పవన్ కల్యాణ్ చేయాల్సింది 20 నుంచి 25 రోజులు మాత్రమే. తాజాగా ఈ చిత్రం గురించి నిర్మాత ఎ.ఎంరత్నం లేటెస్ట్ అప్‌డేట్ ఇచ్చారు. ఓ మీడియాతో మాట్లాడిన ఆయన సినిమా విశేషాలను వెల్లడించారు. 'పవన్ కల్యాణ్ షూటింగ్ చాలావరకూ పూర్తయింది. ఈ ఏడాదిలోనే సినిమాను విడుదల చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. మాగ్జిమం డిసెంబర్‌లో సినిమా ప్రేక్షకుల ముందుకొస్తుంది. షూటింగ్ పెండింగ్ ఉన్నా సినిమా పని జరుగుతూనే ఉంది. మచిలీపట్నం పోర్ట్ సీక్వెన్స కొన్ని సీన్స ఉన్నాయి. ఆ సన్నివేశాల సీజీ బావుండాలని ఇరాన్లో చేయిస్తున్నాం. కుస్తీ ఎపిసోడ్ బెంగళూరులో సీజీ చేస్తున్నారు. ఛార్మినార్ సన్నివేశాలను హైదరాబాద్‌లోనే చేయిస్తున్నారు. సినిమా చూస్తున్న ఆడియన్స్ ని పీరియాడికల్ అట్మాస్పియర్‌కు సినిమా తీసుకెళ్తుంది. ఇందులో పవన్ కల్యాణ్ చేసే వీరోచిత పోరాటాలు ఆకట్టుకుంటాయని అన్నారు. ఇందులో పవన్ కల్యాణ్ పేదల పక్షాన పోరాడే యోధుడిగా కనిపిస్తారు. 17వ శతాబ్దం మొగల్ సామ్రాజ్యం నేపథ్యంలో సాగే ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తీసుకురానున్నారు.



# మహాభారత పాత్రల వక్రీకరణ

### కల్కి సినిమాపై ప్రేక్షకుల్లో అసహనం

సినిమాల్లో కొన్నిసార్లు లాజిక్ ఉండదు. లాజిక్ లేకుండా కథలు సాగుతాయి. అయితే పురాణాల నుంచి తీసుకున్న కథల విషయంలోనూ ఇదే జరుగుతోంది. కల్కి విషయంలోనూ ఇదే జరిగింది. ఈ సినిమా తీయడానికి తనకి భారతీయ పురాణాలు స్ఫూర్తి అని చెప్పారు దర్శకుడు నాగ్ అశ్విన్ పలు సందర్భాల్లో. ఈ సినిమా కథ మొదలవడం ద్వాపరయుగంలో మహాభారత సంగ్రామం అయిన తరువాత శ్రీకృష్ణుడు, అశ్వద్ధామకి శాపం ఇస్తాడు. అలాగే అశ్వద్ధామ చేసిన పాపం పోవాలంటే కలియుగంలో కల్కిగా పుడతాను, అప్పుడు నువ్వు ఆ బిడ్డని కాపాడాలి అని కూడా చెప్తాడు కృష్ణుడు. ఇక కథ కలియుగంకి వస్తుంది.
దీపికా పదుకోన్ గర్భంలో పెరుగుతున్న బిడ్డ కల్కి అవతారమని అశ్వద్ధామ (అమితాబ్ బచ్చన్) ఆ బిడ్డని కాపాడటానికి సర్వప్రయత్నం చేస్తూ ఉంటాడు. చివర్లో విలన్స్ పైచేయిగా అనిపించినప్పుడు భైరవ పాత్రలో వున్న ప్రభాస్‌ని కర్ణుడిగా చూపించి, అశ్వద్ధామకి సహాయం చెయ్యడానికి వస్తాడు. అదే సమయం లో కురుక్షేత్ర యుద్ధంలో కర్ణుడితో యుద్ధం చేస్తున్న అర్జునుడు కర్ణుడు ధాటికి తట్టుకోలేక అతని రథం కొంచెం వెనక్కి వెళుతుంది, ఎందుకంటే కర్ణుడి ప్రభావం తట్టుకోలేక అర్జునుడు వెనకడుగు వేసినట్టుగా చూపిస్తారు. ఈ సినిమా చూసి బయటకి వచ్చిన ప్రేక్షకులకి మాత్రం ఇది మింగుడు పడటం లేదు. ఎందుకంటే కర్ణుడు, అశ్వద్ధామ ఎక్కడ స్నేహం కలిపారు, ఏ భారతంలో చెప్పారు? అలాగే అర్జునుడిపై కర్ణుడిని గొప్ప వీరుడుగా చూపించాడు. ఇది కూడా భారతంలో ఎక్కడ వుంది? మరి ఏ పురాణాలు నాగ్ అశ్విన్ చదివారు అని బయటకి వచ్చిన ప్రేక్షకులు బుర్రలు బద్దలు కొట్టుకుంటున్నారు. మహాభారతంలో కర్ణుడు గొప్ప వీరుడే, కానీ అర్జునుడి కన్నా కాదు. కర్ణుడు ఎంత గొప్ప దానాలు చేసినా, గొప్ప వీరుడైనా అధర్మంవైపు వుండి యుద్ధం చేశాడు. అలాగే అర్జునుడి చేతిలో కురుక్షేత్రం కన్నా ముందు చాలాసార్లు ఓడిపోయాడు. అనేక సందర్భాల్లో కర్ణుడిపై అర్జునుడిదే పైచేయి అవుతుందన్నది మహాహభారత కథ. కర్ణుడు ఓడిపోతూ ఉంటాడు, అంతేకానీ కర్ణుడు ఎప్పుడూ గెలవలేకపోయాడు. ఇక కర్ణుడికి గురువైన ద్రోణాచార్యుడుపై కూడా గురుభక్తి లేదు. ఎన్నోసార్లు ద్రోణాచార్యుడుని అధిక్షేపించాడు కర్ణుడు, అశ్వద్ధామకి కూడా అందుకే కర్ణుడు అంటే పడదు. కర్ణుడు మాటలు విని దుర్యోధనుడు పాడైపోతున్నాడు అని అశ్వద్ధామ కూడా ఎన్నోసార్లు హెచ్చరించాడు. అందువలన అశ్వద్ధామకి, కర్ణుడికి స్నేహం ఎక్కడా వున్నట్టుగా భారతంలో లేదు. అశ్వద్ధామకి పాండవులపై కోపం ఎప్పుడు వచ్చిందంటే, తన తండ్రి ద్రోణాచార్యుడని అన్యాయంగా చంపారని అతను భావించాడు. దృష్టద్యుమ్నుడు కత్తితో ద్రోణాచార్యుడు తల నరుకుతాడు, అది చూసి అశ్వద్ధామ పగ పెంచుకుంటాడు. అయితే ఎక్కడా కూడా కర్ణుడికి, అశ్వద్ధామకి స్నేహం ఉందని మాత్రం చెప్పలేదు. అలాగే అర్జునుడు కన్నా కర్ణుడు ఎందులోనూ సమానుడు కాదు. మరి నాగ్ అశ్విన్ ఎక్కడ పురాణాలూ చదివాడో అర్థం కావటం లేదని ప్రేక్షకులు తలలు పట్టుకుంటున్నారు. అర్జునుడిపై కర్ణుడిని ధీరోదాత్తముగా చూపించడం ప్రేక్షకులకి ఒక పట్టాన మింగుడు పడటం లేదు.

### కల్కి పార్ట్-2 కోసం వేచిచూస్తున్నా: తలైవా





ఈ సినిమాపై సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను ఉద్దేశిస్తూ అగ్ర కథానాయకులు రజనీకాంత్, నాగార్జున పోస్ట్‌లు పెట్టారు. కల్కి' అద్భుతంగా ఉంది. ఇండియన్ సినిమాను నాగ్‌అశ్విన్ మరో స్థాయికి తీసుకెళ్లారు. ఇందులో నటించిన వారికి, ఈ సినిమా కోసం పనిచేసిన అందరికీ శుభాకాంక్షలు. దీని రెండోభాగం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా' అని రజనీకాంత్ పేర్కొన్నారు. ఈ పోస్ట్‌కు దర్శకుడు నాగ్ అశ్విన్ రిప్లై ఇస్తూ.. మాటలు రావడం లేదన్నారు. టీమ్ అందరి తరఫున కృతజ్ఞతలు చెప్పారు. నాగార్జున కూడా సోషల్ మీడియా వేదికగా టీమ్‌కు అభినందనలు తెలిపారు. మీరంతా కలిసి ఇండియన్ సినిమా స్థాయిని మరోసారి నిరూపించారు' అని ప్రశంసించారు. మరోవైపు 'కల్కి'పై ప్రశంసలు కురిపిస్తూ హాలీవుడ్ మీడియా కథనాలు రాసింది. ప్రముఖ హాలీవుడ్ మీడియా సంస్థ డెడ్ లైన్ 'కల్కి' అద్భుతంగా ఉందని పేర్కొంది. దీంతో ప్రభాస్ అభిమానులు ఈ విశేషాలను షేర్ చేస్తున్నారు.

### కల్కి పార్ట్-2 ఉంటుందన్న అశ్వినీదత్




'కల్కి' విజయపథంలో నడుస్తున్న సందర్భంగా చిత్ర నిర్మాత అశ్వనీదత్ మీడియాతో మాట్లాడారు. కల్కి పార్ట్–2కు సంబంధించి కొంతమేర చిత్రీకరణ పూర్తయింది. కొన్ని కీలక సన్నివేశాలు, వీఎఫ్ఎక్స్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. అందుకు ఏడాదిపైనే పట్టొచ్చు. రెండో భాగం విడుదలపై ప్రస్తుతానికి ఎలాంటి తేదీ అనుకోలేదు. వచ్చే ఏడాది ఇదే సమయానికి రావచ్చు. 'కల్కి2' వరకే కథ అనుకున్నాం. పార్ట్–3గురించి ఇంకా ఏమీ అనుకోలేదన్నారు.

## ఆ విషయాన్ని చెప్పడానికి సిగ్గుపడం'

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ ప్రెగ్నెంట్ అంటూ కొన్ని రోజులుగా వస్తోన్న వార్తలపై ఆమె భర్త విక్కీ కౌశల్ స్పందించారు. తన కొత్త చిత్రం ప్రమోషన్‌లో ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ రూమర్ గురించి మాట్లాడారు. 'అలాంటి శుభవార్త ఉంటే మేమే స్వయంగా మీతో పంచుకుంటాం. సరైన సమయం వచ్చినప్పుడు మేం ఆ విషయాన్ని చెప్పడానికి సిగ్గుపడం' అని చెప్పారు. కత్రినా – విక్కీలు 2021డిసెంబర్‌లో ఒక్కటైన విషయం తెలిసిందే. విక్కీ కౌశల్ త్వరలోనే 'బ్యాడ్ న్యూజ్'తో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఆనంద్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో త్రిప్తి దిమ్రీ, అమీ విర్క్ ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. వాస్తవిక సంఘటనల ఆధారంగా రానున్న ఈ కామెడీ ఎంటర్‌టైనర్ జులై 19న ప్రేక్షకుల ముందుకురానుంది.





## సైలెంట్‌గా .. ఓటిటిలోకి సత్యభామ

సుమన్ చిక్కాల దర్శకత్వంలో కాజల్ అగర్వాల్ పోలీసు ఆఫీసర్‌గా నటించిన చిత్రం 'సత్యభామ' క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందిన ఈ చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చి మెప్పించింది. ఇప్పుడీ సినిమా సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా అలరిస్తోంది. నవీన్‌చంద్ర కీలకపాత్రలో కనిపించిన ఈ చిత్రంలో ప్రకాశ్ రాజ్, నాగినీడు, హర్షవర్ధన్, రవి వర్మ, తదితరులు నటించారు. కె.సత్యభామ షీ టీమ్‌లో ఏసీపీ స్థాయిలో పనిచేస్తుంటారు. చూడటానికి శాంతంగా కనిపించినా, నేరస్థుల నుంచి నిజాలు రాబట్టడంలో దిట్ట. తనకు అప్పజెప్పిన కేసుల్ని అంత సులభంగా వదిలిపెట్టదని పేరు. రచయిత అమరేందర్ (నవీన్‌చంద్ర)ని ఇష్టపడి పెళ్లి చేసుకున్న ఆమె వ్యక్తిగత జీవితానికంటే, వృత్తికే ఎక్కువ సమయం కేటాయిస్తుంటుంది. షీ టీమ్‌లో పనిచేస్తున్నప్పుడే హసీనా అనే ఓ బాధితురాలు గృహహింసని అనుభవిస్తూ సాయం కోసం సత్యభామ దగ్గరికి వస్తుంది. ఆ తర్వాత హసీనా తన భర్త చేతిలో దారుణ హత్యకి గురవుతుంది. హసీనాతోపాటు, ఎంతోమంది జీవితాలతో ఆడుకున్న ఆ నేరస్థుడిని పట్టుకునే క్రమంలో సత్యభామకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? ఆ కేసుని ఆమె వ్యక్తిగతంగా తీసుకోవడానికి కారణమేమిటి? తదితర విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

# రూ.30 కోట్లతో భద్రకాళి అభివృద్ధి

**ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు**

**మాస్టర్ ప్లాన్ ప్రకారం పనులు**

**దేవాదాయ, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు**



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని సుప్రసిద్ధ భద్రకాళి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు రూ. 30 కోట్లతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని దేవాదాయ, ధర్మాదాయ, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు వెల్లడించారు. శనివారం ఉదయం వరంగల్ లోని భద్రకాళి ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రోత్చారణల మధ్య ఆశీర్వచనం ఇచ్చి ప్రసాదం అందజేశారు. అనంతరం దేవాలయం అభివృద్ధిపై కమిషనర్ అర్చకులతో చర్చించారు. ఆలయ అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్ ను పరిశీలించారు. ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని అర్చకులు, ఆలయ అధికారులు కమిషనర్ ను కోరారు. ఇందుకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. అనంతరం దేవాదాయ శాఖ కమిషనర్ మాట్లాడుతూ రూ.30 కోట్ల నిధులతో భద్రకాళి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ ప్రకారం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ అభివృద్ధికి ఎల్లవేళల సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అనంతరం ఆలయం పక్కన ఉన్న భూమిని పరిశీలించారు. ఆలయానికి సంబంధించిన అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాలు శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జగన్, అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్ కుమార్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ జె.రాములు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ కిరణ్మయి, దేవాలయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ పౌరుడికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు

**వైద్య రంగం విస్తరించడమే కాంగ్రెస్ లక్ష్యం**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**ఘనంగా మెడికవర్ హాస్పిటల్ ప్రారంభం**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వైద్య రంగాన్ని విస్తరించాలన్న ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా ఇక్కడ మెడికవర్ హాస్పిటల్ ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నగరంలోని హంటర్ రోడ్డులో నాలుగు అంతస్తుల్లో నిర్మించిన మెడికవర్ హాస్పిటల్ ను సీఎం శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, వైద్యం, విద్యుత్ అందుబాటులో ఉంటే విశ్వనగరంగా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. హైదరాబాద్ నగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందింది. ఫార్మారంగం ఎప్పుడు చర్చకు వచ్చినా అందులో హైదరాబాద్ కు స్థానం ఉంటుందన్నారు. ఇందుకు కారణం ఇందిరాగాంధీ దూర దృష్టి అని వివరించారు. రాజీవ్ గాంధీ చొరవతో తెలంగాణలో ఐటీ రంగం రాణించిందని గుర్తు చేశారు. తెలంగాణను మెడికల్ టూరిజం హబ్ గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఫార్మా అభివృద్ధికి ఫార్మా విలేజెస్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. శందాబాద్ లో వెయ్యి ఎకరాల్లో మెడికల్ టూరిజం హబ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. అన్ని రకాల వైద్య సేవలు అందించేలా మెడికల్ టూరిజం హబ్ ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రంలో ప్రతీ పౌరుడికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రతీ పౌరుడికి ఉచిత వైద్యం అందించాలని ప్రభుత్వం యోచిస్తోందని, అందుకు అనుగుణంగానే చర్యలు చేపట్టినట్లు వివరించారు. మా ఆలోచనను ముందుకు తీసుకెళ్లేందుకు సాంకేతికంగా మీ సహాయం కోరుతున్నామన్నారు. ఆసుపత్రికి ఎంతమంది వచ్చారని కాదు.. ఎంతమంది నవ్వుతూ ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లారనేది ముఖ్యం కావాలన్నారు. వైద్యం అందించడం ఒక సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. డబ్బుల కోణంలో కాదు సేవ చేయాలనే దృక్పథంతో పనిచేయాలన్నారు. వరంగల్ లో హెల్త్ టూరిజం, ఎకో టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు.

# మొదలైన అమర్‌నాథ్ యాత్ర

**భారీ భద్రతా ఏర్పాట్లు**



**వరంగల్ వాయిస్, జమ్ము :** భక్తులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న అమర్ నాథ్ యాత్ర శనివారం మొదలైంది. పవిత్ర గుహలో శివలింగ దర్శనానికి భక్తులు భారీ ఎత్తున్న రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 48 కివిరీ. నున్వాన్-పహల్గామ్ మార్గం, 14 కివిరీ. బల్తాల్ మార్గం గుండా యాత్రికుల మొదటి బ్యాచ్ కదిలింది. రెండు మార్గాలల్లోని యాత్రికుల బ్యాచ్ లను సంబంధిత డిప్యూటీ కమిషనర్లతో పాటు పోలీసు, సివిల్ అధికారులు సాగనంపారు. జమ్మూలోని భగవతి నగర్ లోని యాత్రి నివాస్ బేస్ క్యాంపు నుంచి 4,603 భక్తుల మొదటి బ్యాచ్ కు జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ సిన్హా జెండా ఊపి పంపారు. 1,881 మంది యాత్రికులు ఉన్న రెండో బ్యాచ్ ను కూడా భగవతి నగర్ బేస్ క్యాంప్ నుంచి పంపారు. భక్తుల రక్షణ కోసం పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, ఇండో-టిబెటన్ బార్డర్ పోలీసులను మోహరించారు. వైమానిక నిఘా కూడా పెట్టారు. ఇదిలావుండగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పవిత్ర యాత్రకు ఉపక్రమించిన యాత్రికులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పరమశివుడి ఆశీస్సులతో భక్తులందరూ వర్ధిల్లాలని కోరారు.





# డీజీపీని కలిసిన సీపీ

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు శనివారం ఉదయం పోలీస్ గెస్ట్ హౌస్‌కు చేరుకున్న రాష్ట్ర డీజీపీ రవి గుప్తాకు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం డీజీపీకి సాయుధ పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. డీజీపీని కలిసిన వారిలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి ఉన్నారు. కాగా గీసుగొండ లోని కాకతీయ మెగా టెక్స్ టైల్స్ పార్కుకు హెలికాప్టర్ లో చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డీజీపీ రవిగుప్త, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ మర్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు.

# మహిళలకు ఆర్థిక చేయూత

**శిక్షణతో పాటు, రుణ మంజూరుకు కసరత్తు**

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** స్వయం సహాయక సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో విరీ సేవ కేంద్రాలను కూడా మహిళా సంఘాలకు అప్పగించాలని నిర్ణయించింది. ఈ సేవ, విరీ సేవ పేరుతో కేంద్రాలను మంజూరు చేస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో గ్రావిరీణ ప్రజలకు విరీ సేవ ద్వారా ఆన్‌లైన్ సేవలు అందడంతో పాటు వాటి నిర్వహణ ద్వారా మహిళా సంఘాలు ఆర్థికంగా లాభం పొందనున్నాయి. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా 4,525 విరీసేవ కేంద్రాలు ఉన్నాయి. అయితే వీటిలో మూడు వేల వరకు పట్టణ, నగర ప్రాంతాల్లోనే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో తక్కువగా ఉన్నాయి. పన్నెండు వేలకుపైగా పంచాయతీలు ఉంటే.. వెయ్యి గ్రామాల్లోనే విరీ సేవ కేంద్రాలున్నాయి. ఈ సేవ కేంద్రాలు అందుబాటులో లేకపోవడం వల్ల చిన్న పనులకు కూడా ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని గమనించిన తెలంగాణ ప్రభుత్వం మహిళా సంఘాలకు వీటిని కేటాయించాలని నిర్ణయించింది. గ్రామాల్లో విరీ సేవ కేంద్రాలు పెట్టుకునేందుకు స్వయం సహాయ సంఘాలకు రెండున్నర లక్షల వరకూ రుణం మంజూరు చేయనున్నారు. ఈ ధనంతో ఈ సేవ కేంద్రాలకు అవసరమైన సాంకేతిక పరికరాలను కేటాయిస్తారు. గ్రావిరీణ ప్రాంతాల్లోనే ఏర్పాటు చేస్తారు కాబట్టి.. ఆ కేంద్రాలకు అవసరమైన స్థలం కూడా ప్రభుత్వ భవనాలలోనే లభ్యతను బట్టి కేటాయించే అవకాశం ఉంది. ఇంటర్ పాసైన వారిని ఆపరేటర్లుగా పని చేసేందుకు శిక్షణ ఇప్పిస్తారు. విరీ సేవ అధికారుల పర్యవేక్షణలో ఇవి పని చేస్తాయి. విరీ సేవ కేంద్రాల ఏర్పాటుకు ముందుకొచ్చే సంఘాలను ఎంపిక చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. ఆగస్టు 15నాటికి గ్రామాల్లో విరీసేవ కేంద్రాలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. మహిళల అభ్యున్నతికి రేవంత్ సర్కార్ పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఇటీవల మహిళాశక్తి క్యాంటీన్లను కూడా ప్రారంభించారు. నే ఎస్‌హెచ్‌జీ సభ్యులతో మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయిస్తున్నారు. వరంగల్ పర్యటనలో రేవంత్ రెడ్డి మహిళా శక్తి క్యాంటిన్లను ప్రారంభించారు. మహిళా సంఘాలకు అనేక ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రేవంత్ సర్కార్ క్యాంటీన్ విస్తీర్ణంకు అనుగుణంగా ఒక్కోదాంట్లో ఐదు నుంచి 20 మంది సభ్యులు పనిచేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఆసక్తి, కష్టపడే తత్వం కలి గిన 50 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులను ఎంపిక చేశారు. శిక్షణ కూడా ఇచ్చారు. ఇప్పుడు విరీ సేవ కేంద్రాలను కూడా మహిళా సంఘాలకు కేటాయిస్తూండటంతో.. మహిళలు పెద్ద ఎత్తున ఆర్థికంగా నిలబడే అవకాశం కలుగుతోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com